ప్రజాశక్తి

శనివారం 24 ఆగష్టు 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

అద్దంకి నియోజకవర్గం, మక్కెనవారిపాలెంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

గ్రామాల అభివృద్ధి దిశగా..

- ఒకే రోజు అన్ని గ్రామాల్లో స్వర్ణ గ్రామ పంచాయతీ సభలు
- పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు
- గ్రామసభలపై బదిలీల ప్రభావం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గ్రామ పంచాయతీలను అన్నింటా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒక్క రోజు గ్రామ సభలు శుక్రవారం జిల్లాఅంతటా జరిగాయి. స్వర్ణ గ్రామ పంచాయతీలే ధ్యేయంగా సుస్థిరాభివద్ధి లక్ష్యంగా జరిగిన ఈ గ్రామసభల్లో జిల్లాలోని ఇద్దరు మంత్రులు, అందరు ప్రజాప్రతినిధులు పాల్గొని గ్రామ సభల గురించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని రేపల్లే నియోజకవర్గం నగరం మండలం ధూళిపూడి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గం లోని మక్కెనవారిపాలెంలో జరిగిన గ్రామసభ లో పాల్గొన్నారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ రాజు, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య తమ నియోజకవర్గాల్లో జరిగిన గ్రామసభల్లో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాలను వివరించి ప్రజల నుంచి వినతిపత్రాలు ▶ 2లో

పాలనలో నిస్తేజం..

- జిల్లా అధికారుల బదిలీల్లో అసాధారణ జాప్యం
- కీలక నిర్ణయాలపై అంటీముట్టనట్టుగా అధికారులు
- రాష్ట్రస్థాయి నిర్ణయంగా ఉన్నందున మంత్రులూ మౌనం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లా అధికారుల బదిలీల్లో అసాధారణ జాప్యం కొనసాగుతోంది. కారణాలేమైనా జిల్లా అధికారుల బదిలీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకోవడం లేదనే చర్చ సాగుతోంది. ఇప్పటివరకూ కలెక్టర్, ఎస్పీతో పాటు పోలీసు శాఖలో కొన్ని బదిలీలు జరిగాయి. రెవెన్యూశాఖపరంగా ఇప్పటివరకూ డివిజన్, జిల్లాస్థాయి అధికారుల బదిలీలు జరగలేదు. కలెక్టర్ స్థాయిలో తహశీల్దార్ల బదిలీలు నిర్వహించారు. మూడు నెలలుగా జిల్లా అధికారులు బదిలీల కోసం వేచిచూస్తున్నారు. రేపోమాపో అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కీలక నిర్ణయాలు తీసుకోవ డానికి వెనకాడుతున్నారు. కొందరు నెలాఖరు కు ఉద్యోగవిరమణ చేస్తుండగా మరికొందరు రెండు నెలలు సమయంలో రిటైర్ అవుతు న్నారు. వీళ్లంతా రిక్వెస్టు పెట్టుకుని ఇక్కడే కొనసాగించాలని కోరుతున్నారు. ఫలితంగా పాలనలో నిస్తేజం కనిపిస్తోంది. ప్రభుత్వం మారాక పాలన వేగంగా లేదనే చర్చ సాగు తోంది. ఇంకా చెప్పాలంటే ప్రస్తుతం పాలన పడకేసిందంటున్నారు. జిల్లాపరిషత్, డిపిఒ, డిఆర్‌డిఎ, డ్వామా, ఐసిడిఎస్, వైద్యఆరోగ్య శాఖ, విద్యాశాఖ ఇలా కీలకమైన శాఖల్లో అధికారులు లేరు. ఇన్‌ఛార్జిలే ఉన్నారు. పూర్తిస్థాయిలో జిల్లా అధికారులను పెట్టడం లేదు. చివరికి డిఆర్‌ఒ కూడా ఇన్‌ఛార్జి అధికారే పనిచేస్తున్నారు. ఆర్డీవోలు ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యేలు కొందరు జిల్లా అధికారులను సిఫార్సులు చేశారు. వారంతా పోస్టింగుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎవరికీ ఇవ్వలేదు. రోజుకో శాఖపై బదిలీల జీవోలు ఇస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి. మిగతాశాఖల్లో నిదానంగా సాగుతున్నాయి. కీలకమైన శాఖల్లో బదిలీలు జరిగితే గానీ పాలనలో వేగం కనిపించేలా లేదు. ఈ వ్యవహారం రాష్ట్రస్థాయిలో ముడిపడి ఉన్నందున మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిర్ణయంగా భావిస్తున్నారు. దీని వల్ల కీలకమైన నిర్ణయాలు ఏమీ సాగడం లేదు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాత్రం శాఖలపరంగా సమీక్షలు చేస్తున్నారు. తర్వాత వాటిపై ప్రణాళికల రూపకల్పన ప్రశ్నార్థకంగా మారింది. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలపైనా ఆచీతూచీ ▶ 2లో

10 మంది డిటిలకు

తహశీల్దార్లుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని పది మంది ఉప తహశీల్దార్లను అడహక్ తహశీల్దార్లుగా నియమిస్తూ కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శుక్రవారం రాత్రి ఉత్త ర్వులు జారీ చేశారు. దోర్నాల తహశీల్దార్‌గా పనిచేస్తున్న పి.బాలాజి విశ్వనాథ్‌ను కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న టి.రవిని సింగరాయకొండ తహశీల్దార్‌గా నియ మించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యా లయంలో కెకెఆర్‌సి ప్రత్యేక తహశీల్దార్‌గా పని చేస్తున్న కె.దాసును అర్ధవీడు తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ కార్యాలయంలో డిటిగా పని చేస్తున్న పి.మురళిని కొండపి తహశీల్దార్‌గా నియమించారు. మార్కాపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటిగా పనిచేస్తున్న జి.ఆంజనేయులును టంగు టూరు తహశీల్దార్‌గా ▶ 3లో

రాష్ట్ర అభివృద్ధిలో

ప్రకాశం పంతులు పాత్ర అజరామరం

- రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామి
- ఘనంగా ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్వాతంత్ర్య పోరాటంలో, రాష్ట్రాభివృద్ధిలోనూ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పోషించిన పాత్ర అజరామరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాం గులు, వయోవద్దుల సంక్షేమం, సచివాలయాలు, గ్రామ వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతిని పురస్కరించు కుని శుక్రవారం ▶ 3లో

ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్

గ్రామాల అభివృద్ధి దిశగా..

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రం అభివద్ధి వైపు పరుగులు పెడుతోందన్నారు. దానిలో భాగంగా స్వర్ణ గ్రామ పంచాయితీలు అనే కార్యక్రమంను ప్రభుత్వం ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ గ్రామసభల్లో అధికారులు గ్రామాలకు వచ్చి ప్రజలతో మమేకమై.. సమస్యలను అధ్యయనం చేసి తీర్మానించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులను కేటాయించిందన్నారు.

గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు అధికారులకు అర్జీలు అందిస్తే వాటిని పరిశీలించి అధికారులు సమస్యలను తప్పక పరిష్కరిస్తారన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు సరిగ్గా లేక ఇప్పటికీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలల కాలంలోనే ఎంతో వేగంగా స్పందించి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాల అభివద్ధికి కషి చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం రూ.1400 కోట్ల రూపాయలను విడుదల చేయడమే కాకుండా ఒకేరోజు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలను నిర్వహించడం గొప్ప కార్యక్రమం అన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, విద్యుత్ కనెక్షన్లు లాంటివి లేకపోయినా ఈ గ్రామసభల్లో తీర్మానించవచ్చని చెప్పారు. ఉపాధి హామీ కింద గ్రామాల్లోని పంట పొలాలు ఉన్న రైతులు హార్టికల్చర్, మొక్కలు పెంచుకునేందుకు సహకారం అందిస్తారన్నారు.

గ్రామసభలపై బదిలీల ప్రభావం

జిల్లాలో అన్ని స్థాయిల అధికారుల బదిలీలు ఈ వారంలో జరగనున్న నేపథ్యంలో గ్రామసభలపై బదిలీల ప్రభావం పడినట్లు భావిస్తున్నారు. ఈ గ్రామసభలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.ఒకే రోజు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలకు శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ కార్యక్రమాల అమలుతో పాటు నాలుగు అంశాల అమలుపై ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. ప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది. కానీ జిల్లా అధికారులతో పాటు గ్రామ పంచాయితీ అధికారు లు, ఎంపిడివోలు, డ్వామా అధికార సిబ్బంది, సచివాలయ సిబ్బంది కూడా బదిలీల హడావుడిలో ఉన్నారు. దీంతో సదరు సభల్లో ప్రభుత్వం ప్రస్తావించిన ముఖ్యమైన అంశాల గురించి చర్చించే పరిస్థితి లేకపోయింది.

ఒక్క ఉపాధి హామి కార్యక్రమాల గురించి మాత్రమే సభల్లో ప్రస్తా వన చేశారు. ప్రజాప్రతినిధులు హాజరయిన గ్రామసభలు దాదాపు వారి ఉపన్యాసాలతోనే ముగిశాయి. సభల్లో గ్రామ అవసరాల గురించి చర్చించే పరిస్థితి కనిపించలేదు. గ్రామ సభలు అయితే జరిగాయి గానీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకోసం ఈ సభలను జరపాలనుకున్నారో సదరు లక్ష్యం నెరవేరడంలో మాత్రం ఉద్యోగుల బదిలీలు అడ్డుపడ్డాయనే భావించాల్సి వస్తుంది.

పాలనలో నిస్తేజం..

(మొదటిపేజీ తరువాయి)

అడుగులు వేస్తున్నారు. తాజాగా గ్రామసభలు నిర్వహిం చారు. వాటిపైనా జిల్లా అధికారులు సీరియస్‌గా ఉండే పరిస్థితి లేదు. ఎందుకంటే బదిలీలు జరిగితే ఇక్కడ నుంచి అందరూ వెళతారు. కొత్తవారు వస్తారు. ఈ లోపు మనకెందు కు అనే భావనలోనే ఉన్నారు. ఇసుక, పింఛన్లు, అన్నా క్యాంటీ న్లు ఇవే అమలులోకి వచ్చాయి. కేబినెట్ కొన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. భూముల ఆక్రమణ లపై విచారణలు, కుంభకోణాలపైనా చర్యలు, 22ఏ భూములపై విచారణలు, అసైన్‌భూ ముల అన్యాక్రాంతాలు వంటి వాటిని నిగ్గు తేల్చాలని నిర్ణయించారు. అందుకు తగ్గట్టుగా అధికారులు లేరు. రెవెన్యూశాఖ పరంగా ఆర్డీఓలు, డిఆర్‌ఓ వంటి కీలకపోస్టులు పెండిం గులో ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న అధికారులు ఈ నిర్ణయాలు తీసుకునేలా కనిపించడం లేదు. నిర్వాసితుల సమస్యలు, పునరావాసం వంటి వాటిపైనా దృష్టి సారించ లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి ఏదైనా చెబితే బదిలీలు పూర్తయ్యాక చూద్దామని చెప్పి పంపుతున్నారు. అర్జీలకు మోక్షం కలగడం లేదు. వాటిని పరిశీలించి తగు నిర్ణయాలు, ఆదేశాలు జిల్లా కేంద్రం నుంచి వెళ్లడం లేదు. ఏదేమైనా పాలనలో వేగం పెరగాలంటే అధికారులపై తక్షణం నిర్ణయం తీసుకోవాలి. ఎవరు ఉంటారో ఎవరు బదిలీలపై వెళతారో స్పష్టత ఇచ్చినా కొంత మార్పు వచ్చే అవకాశం ఉంది.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు ప్రకాశం జిల్లా, మార్కాపురం టౌన్ కాపురస్తుడు **దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి** గారి కుమారుడు **మురళీధర్‌రెడ్డి** గారి వలన సంజా యిషి పొంది యావన్మందికి తెలియజేయునది.

ఈ క్రింది షెడ్యూలు ఆస్థులు దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి మరియు నాక్లయింటుకు సం క్రమించిన జాయింటు కుటుంబ ఆస్థులు అయి ఉన్నవి. క్రింది షెడ్యూలు ఆస్థులలో నా క్లయింటుకు 1/3వ భాగం హక్కు కలదు. కాని నా క్లయింటు తండ్రి దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి నా క్లయింటుకు భాగం ఉన్న విషయం మభ్యపెట్టి షెడ్యూలు ఆస్థులను ఇతరులకు విక్రయించుటన్ను మరియు అప్పులు చేసి హామీగాను క్రింది షెడ్యూలు ఆస్థులను మొత్తం తనకు హక్కుగా ఉన్నట్లు చూపించుచున్నట్లు తెలియవచ్చినది. కాబట్టి యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఎవ్వరైన దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి వద్ద నుండి క్రింది షెడ్యూలు ఆస్థులకు నా క్లయింటు భాగమును మభ్యపెట్టి ఏరకమైన దస్తావేజు లను పొందినను అవి నా క్లయింటు హక్కును బద్ధపరచవని మరియు వారిపై క్రిమినల్ మరియు సివిల్ ప్రాసిక్యూషన్ జరుపబడునని ఖండితముగా తెలియజే యడమైనది. మరియు దుగ్గెంపూడి పిచ్చిరెడ్డి చేసిన అప్పులతో నా క్లయింటుకు ఎలాం టి సంబంధంలేదని అవి తీర్చవలసిన బాధ్యత నాక్లయింటుకు లేదని మరి ముఖ్యం గా తెలియజేయడమైనది.

షెడ్యూలు : ప్రకాశం జిల్లా ఒంగోలు రి.డి. మార్కాపురం సబ్.డి. పెద్దారవీడు మం డలం, తోకపల్లి గ్రామం మరియు రెవెన్యూ ఇలాకా..

1) సర్వే నెంబర్లు : 1) S.No. 4/1C విస్తీర్ణం AC 0-05 సెంట్లు, 2) S.No. 4/3A విస్తీర్ణం AC 0-78 సెంట్లు, 3) S.No. 5/1 విస్తీర్ణం AC 0-09 సెంట్లు, 4) S.No. 5/3A విస్తీర్ణం AC 6-35 సెంట్లు, 5) S.No. 5/3C విస్తీర్ణం AC 4-97 సెంట్లు, 6) S.No. 25 విస్తీర్ణం AC 3-49 సెంట్లు, 7) S.No. 21 విస్తీర్ణం AC 1-94 సెంట్లు, 8) S.No. 23 విస్తీర్ణం AC 1-52 సెంట్లు, 9) S.No. 3/1A, 3/1A2, 3/1C1, 3/1C3 లలో విస్తీర్ణం AC 3-06 సెంట్లు, 10) S.No. 4/1A విస్తీర్ణం AC 0-53 సెంట్లు, 11) S.No. 4/3C విస్తీర్ణం AC 0-54 సెంట్లు, 12) S.No. 26 విస్తీర్ణం AC 2-32 సెంట్లు, 13) S.No. 20/1, 20/2, 20/3 మరియు 20/4 లలో విస్తీర్ణం AC 6-23 సెంట్లు

(2) ప్రకాశం జిల్లా, ఒంగోలు రి.డి. మార్కాపురం సబ్.డి. మార్కాపురం టౌన్ ఇలాకా ఇంటి నెంబరు 10-1052-L (సంజీవ్‌రెడ్డి నగర్) (3) పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామం ఇలాకా సర్వే నెంబరు 154/1,2,3,4 విస్తీర్ణం AC 3-36 సెంట్లు

M. Subba Reddy, Advocate. Markapur. Praksam Dist

దావా సమను

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 75/2024

Between:-

పాబోలు వెంకటేశ్వర్లు ..... వాది

మరియు

మువ్వల సుబ్రమణ్యం ...... ప్రతివాది

To

మువ్వల సుబ్రమణ్యం S/o లేటు ఆంజనేయులు డోర్ నెం. 12-31, పర్చూరు, బాపట్ల జిల్లా.

పై నంబరు గల దావాను మీపై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది.02-09-2024 న ఉ: 10.30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపు కొన వలసినది . లేని ఎడల మీ పరోక్షము నందు దావాను విచారించి తీర్మానించ బడును.

// కోర్టు వారి అనుమతితో //

వాయిదా తేది : 02-09-2024

ఇట్లు

రావి సత్యనారాయణ

రావి శ్రీనివాసరావు

CH శ్రీ రమణి

న్యాయవాదులు, పర్చూరు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ ఫ్యామిలీ జిల్లా జడ్జి వారి కోర్టులో ఒంగోలు

F.C.O.P. 112/2024

మధ్య

సిరసపల్లి నాగ రమామణి .....పిటీషనర్

మరియు

నిల్ ....రెస్పాండెంట్

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పై నంబరు పిటీషన్ లో మైనర్ అయినటువంటి ఆకుల అనీల్ కుమార్ గారి కుమార్తె ఆకుల హరిశ్రీ తల్లి ఆకుల @ సిరసపల్లి నాగ నవ్య మరణానంతరం, అమ్మమ్మ అయినటువంటి నాగ రమామణి దగ్గర ఉంటున్నారు. ఈ సందర్భంలో పిటీషనర్ అయిన అమ్మమ్మ నాగ రమామణి, మనవరాలు మైనరు అయినటువంటి హరిశ్రీ కి గార్డియన్‌గా ఉండుటకు అనుమతి కోరుచూ పైనెంబరు పిటీషన్‌ను ధాఖలు చేసి ఉన్నారు. సదరు విషయమై ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది. 02-09-2024 న ఉదయం 10:30 నిమిషాలకు మీరు కానీ లేదా మీ వకీలు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు పైకోర్టువారి ఎదుట తెలుపుకోవలసిందిగా యావన్మందికి తెలియపరచట మైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా తేదీ- 02-09-2024 **ఇట్లు**

అక్కరాజు నిర్మల్

పిటిషనర్ తరపు న్యాయవాది

9-1-7, గ్రౌండ్ ఫ్లోర్

శాంకరీ బిల్డింగ్, ఒంగోలు

సెల్ : 9848546050

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.ఎస్.నెం:143/2020

పెరుమాళ్ళ నాగేశ్వరరావు ..వాది

వర్సెస్

తాళ్లూరి కోటయ్య ...ప్రతివాది

To

తాళ్లూరి కోటయ్య, తండ్రి నరసయ్య,
నిమ్మాపురం గ్రామం, పొదిలి మండలం,
ప్రకాశం జిల్లా.

నోటీసు

మీరు వాది వద్ద అప్పు తీసుకొని మీరు వాది పేరున వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు బాకీ వసూలు నిమిత్తం వాది శ్రీ కోర్టు వారి నందు పై నెంబరు దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని మార్లు నోటీసులు పంపించినను మీకు చేరనందున మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పై దావాను తేదీ:28-08-2024 నకు వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు తేదీన ఉదయంగం.10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని, లాయర్ గారి ద్వారా గాని శ్రీ కోర్టువారి ముందు హాజరై పై దావాలో మీ అభ్యంతరములు తెలుపు కొనవలెను. లేని యెడల పై దావాను శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

పొదిలి

తేదీ : 23-08-2024

వాయిదా తేదీ : 28-08-2024 **ఇట్లు**

ఉడుముల లక్ష్మిరెడ్డి, బి.ఏ.బీఎల్,

వాది తరపు అడ్వకేట్,

పొదిలి, ప్రకాశం జిల్లా.

సెల్:9440202059.

జనరల్ నోటీసు

మహారాజ శ్రీ ఒంగోలు 1వ అడిషనల్ జిల్లా జడ్జివారి కోర్టులో

E.A. No. 184/2024

E.P. No.51/2013

O.S.No. 206/2011

ఏలూరి సుబ్బారావు ......పిటిషనర్

వర్సెస్

అయినాబత్తిన కృష్ణయ్య (died) మరియు ఇతరులు .... రెస్పాండెంట్

To.

(3వ రెస్పాండెంట్)

ఆకుల సునీత, భర్త, ధనుంజయరావు,
తండ్రి. లేట్ అయినాబత్తిన కృష్ణయ్య,
ఫ్లాట్ No. G4, మారుతిరామ్ అపార్ట్ మెంట్,
2వ లైన్, ధారావారితోట, ఒంగోలు టౌన్,
ప్రకాశం జిల్లా.

పై నంబరు గల పిటిషనులో, మీకు నోటీసు నిమిత్తము ఎన్ని సార్లు నోటీసు పంపినా నోటీసు చేరనందున శ్రీ కోర్టు వారు ప్రజాశక్తి పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఈ ప్రకటన చూసిన తరువాత తేది:12-09-2024 ఉదయం 10.30 లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగాగాని, లేదా అడ్వకేటు ద్వారా గాని హాజరై నీ యొక్క సమాధానం తెలుపుకొన వలసినది, లేని యెడల పై తెలిపిన పిటిషన్‌లో మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు

తేది : 23-08-2024 **ఇట్లు**

పంగులూరి గోవిందయ్య,

అడ్వకేట్, ఒంగోలు.

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.ఎస్.నెం:337/2022

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజర్, పొదిలి ... వాది

వర్సెస్

1. ఎనిమిరెడ్డి సుబ్బారెడ్డి,
2. ఎనిమిరెడ్డి బాల కోటిరెడ్డి ...ప్రతివాదులు

To,

D1) ఎనిమిరెడ్డి సుబ్బారెడ్డి, తండ్రి అంకయ్య,
ఆముదాల పల్లి గ్రామం, పొదిలి మండలం,
ప్రకాశం జిల్లా.

D2) ఎనిమిరెడ్డి బాలకోటి రెడ్డి, తండ్రి అంకిరెడ్డి,
పొదిలి గ్రామం, పొదిలి మండలం, ప్రకాశం జిల్లా.

నోటీసు

మీలో ఒకటవ వారు వాది బ్యాంకులో రుణము తీసుకొని ఉండగా 2వ వారు షురిటీగా ఉండి మీరు ఇరువురు ఋణము చెల్లించనందున ఋణము వసువులు నిమిత్తం వాది మీపై దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని మార్లు నోటీసులు పంపించినను మీకు చేరనందున పై దావాను తేదీ: 03-09-2024 నకు వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు దావాలో మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న ఎడల పై తేదీన ఉదయం గం.10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని, లాయర్ గారి ద్వారా గాని శ్రీ కోర్టువారి ముందు హాజరై పై దావాలో మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావాను శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

పొదిలి

తేదీ : 23-08-2024

వాయిదా తేదీ : 03-09-2024 **ఇట్లు**

ఉడుముల లక్ష్మిరెడ్డి, బి.ఏ.బీఎల్,

వాది తరపు అడ్వకేట్,

పొదిలి, ప్రకాశం జిల్లా.

సెల్:9440202059.

మహారాజశ్రీ

మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

ఇ.పి. నెం:21/2019

ఇన్

ఓ.ఎస్. నెం:30/2014

కొత్తా నాగేశ్వరరావు ...... డి.హెచ్.ఆర్

వర్సెస్

శేగు వెంకటేశ్వర్లు ..... జె.డి.ఆర్

వేలం ప్రకటన

పై నెంబరు ఇ.పి. షెడ్యూలు లోని ఐటమ్ నెం:2 ఆస్థిని డి.హెచ.ఆర్ బాకీ రాబట్టు నిమిత్తం ఘనమైన కోర్టులో తేదీ 10-09-2024 ఉదయం 10:30 గంటలకు బహిరంగ వేలము వేయుటకు కోర్టు వారు నిర్ణయించడమైనది. ఈ బహిరంగ వేలంలో పాల్గనదలచిన వారు వేలంలో పాల్గనవచ్చును.

ఐటమ్ నెం: 2 షెడ్యూలు: ప్రకాశం జిల్లా మార్కాపురం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్‌లోని గిద్దలూరు సబ్ డిస్ట్రిక్ట్‌లోని గిద్దలూరు నగర పంచాయతీలోని సర్వే నెం: 693/2బి, 693/2సి, 694/2 మరియు 694/3లోని ఎ॥ 3.36 సెం॥ పైకి 2,805 చ.గజాల స్థలంలోని రెండు అయిటములులోని ఇంటికి డోర్ నెం: 8-17-49/43క్యు మరియు ఎస్సార్ కంపెనీ మేనేజింగ్ చేయు వెంకట ఏజెన్సీస్ పేరు గల పెట్రోలు బంకు కలిపి రెండింటికి ఒకటే హద్దులు.

తూర్పు: శీలం శ్రీనివాసరెడ్డి మరియు శీలం రమణారెడ్డి గార్ల స్థలాలు.

దక్షిణం: నంద్యాల నుండి ఒంగోలు పోవు ఆర్అండ్‌బి రోడ్డు

పడమర: మాగం సుబ్బారెడ్డి పొలము.

ఉత్తరం: జె.డి.ఆర్ అయిన శేగు వెంకటేశ్వర్లు గారి మిగిలిన పొలం.

తూర్పు-పడమర: 153 అడుగులు, ఉత్తరరాదక్షిణం: 165 అడుగులు కొలతలు గల 2,805 చ.గజాల స్థలం.

డి.హెచ్.ఆర్ విలువ: రూ. 50,00,000/-

అమీనా విలువ: రూ. 75,00,000/-

వేలం తేదీ: 10-09-2024

ఫర్ధర్ హియరింగ్: 17-09-2024

// కోర్టు వారి ఉత్తర్వులతో //

షేక్ షహనాజ్ బేగం,

అడ్వకేట్, మార్కాపురం.

వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

జోరుగా ఇసుక తరలింపు

నిత్యం ట్రాక్టర్లతో తరలిస్తున్న వైనం

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీ నవ్వుల పాలవుతోంది. ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇచ్చిన ఆదేశాలు నీటి మూటలయ్యారు. ఇసుక అక్రమ తరలింపు జోరుగా కొనసాగుతోంది. పాలేరు పరీవాహక ప్రాంతమైన జరుగుమల్లి, చింతలపాలెం, కె.బిట్రగుంట నుంచి ప్రతిరోజూ అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. చింతలపాలెం గ్రామం నుండి నిత్యం ప్రతి సమయంలోనూ ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులుల కళ్లెదుటే ఇసుక తరలి పోతున్నా ప్రేక్షక పాత్ర వహిస్తూ మౌనంగా చూస్తున్నారే తప్ప అడ్డుకున్న దాఖలాలు లేవు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఏడు ఇసుక ట్రాక్టర్లు జరుగుమల్లి పోలీస్ స్టేషన్ మీదుగా వెళ్లినా పట్టించుకున్న వారే లేరు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

అధికారులకు వరం.. గృహనిర్మాణదారులకు శాపం

ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం పలు శాఖల అధికారులకు వరంగా మారగా గృహనిర్మాణదారులకు మాత్రం శాపంగా మారింది. అన్ని శాఖల అధికారులకు మామూళ్లు పోతున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. కాగా గృహనిర్మాణ దారులకు ఇసుక అందక ఇబ్బందులు తప్పడం లేదు. పోలీస్ స్టేషన్ మీదుగా ఇసుక తరలిస్తున్నా పోలీసు సిబ్బంది కానీ, రెవెన్యూ అధికారులు కానీ తమకు సంబంధమే లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతినెలా ట్రాక్టరుకు రూ.10 వేల నుండి రూ.20 వేలు వరకు అధికారులకు మాఫియా ముట్టచెపుతున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు. ఇటీవల జరుగుమల్లి ఎస్ఐ వెంకటేశ్వరరావు పుట్టిన రోజు వేడుకలను ఇసుక మాఫియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీంతో సదరు ఎస్ఐ విఆర్‌కు పయనమయ్యారు. సెబ్ అధికారులు, భుగర్భ శాఖకు చెందిన అధికారులు కళ్ళు మూసుకొని ఇసుక మాఫియా పైసలకు నిద్రలోకి జారుకున్నారు. జరుగుమల్లి నుంచి పాలేటిలోని ఇసుక రూ.2,500 లకు అక్రమంగా ఇసుక తోలుతున్నారు. పాలేరు వాగులోని ఇసుక అధికారులకు అదనపు ఆదాయం అయిందే తప్ప గృహ నిర్మాణదారులకు ఉపయోగం లేదన్నది వాస్తవం. ఇకనైనా జిల్లా కలెక్టరు తమీమ్ అన్సారియా స్పందించి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు మండలంలోని వేయంపాడులో పాలేరు నది నుండి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై గిరిబాబు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను తహాశీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనంతరం తహాశీల్దార్ పుల్లారావు రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎంతటి వారైనా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు. జూదం, కోడి పందాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై గిరిబాబు తెలిపారు.

అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

అంగన్‌వాడీ కార్యకర్తలు, అయాలకు 200 యూనిట్లు కరెంటు బిల్లు మినహాయింపు ఇవ్వాలంటూ ఏపీ ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర నాయకులు కత్తి అనోజిరావు కోరారు. గిద్దలూరు ఎపిసిపిడిసిఎల్ డిఇఇ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్ మోహన్ రావుకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనోజిరావ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్, మధ్యాహ్న భోజనం వర్కర్స్ ఉద్యోగస్తులు కారని గౌరవ వేతనం తీసుకుండేవారనీ వీరు ఎక్కువ మంది ఎస్సీలు, ఎస్టీలు, ఆర్థికంగా వెనుకబడిన వారు కావున వీరికి గతంలో 200 యూనిట్స్ వరకు కరెంటు బిల్లు ఉచితంగా ప్రభుత్వం ఇచ్చేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు పరదేశి రాజశేఖర్, పెరికె జయరాజు, జిల్లా ఎస్సీ ఎస్టీ నాయకులు పందిటి రాము, దళిత నాయకులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

గిద్దలూరులో న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - గిద్దలూరు

కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని గిద్దలూరు బార్ అసోసియెషన్ అధ్యక్షుడు శేషశయనా రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు నుండి గాంధీ బొమ్మ విగ్రహం వరకు గిద్దలూరు బార్ అసోసియెషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేసారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిద్దలూరు బార్ అసోసియెషన్ అధ్యక్షుడు శేషశయనా రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ల వృత్తి ఎంతో విలువైనదని కరోనా సమయంలో డాక్టర్లు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడారని, అలాంటి డాక్టర్లకు రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు వారు పని చేసే ప్రదేశాల్లో భద్రత కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని, మహిళలకు రక్షణ కల్పించే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఆయన కోరారు.

కొమరోలు ఎంపీడీవోగా నరసయ్య

ప్రజాశక్తి - కొమరోలు

కొమరోలు ఎంపీడీవోగా డి.నరసయ్య బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహి స్తున్న ఎంపీడీవో నం´సింహారావు గత శనివారం బదిలీపై గుంటూరు జిల్లా కు వెళ్లారు. ఆయన స్థానంలో నరసయ్యను నియమిం చగా ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నరసయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

10 మంది డిటిలకు తహాశీల్దార్లుగా ఉద్యోగోన్నతి

(మొదటిపేజీ తరువాయి)

నియమించారు. పొదిలి తహాశీల్దార్ కార్యాలయంలో రీ సర్వే డిటిగా పనిచేస్తున్న కె.శాంతిని దోర్నాల తహాశీల్దార్‌గా నియమించారు. వెలిగండ్ల తహాశీల్దార్ కార్యాలయంలో డిటిగా పనిచేస్తున్న సిహెచ్ నాగార్జున రెడ్డిని మార్కాపురం సబ్‌కలెక్టర్ కెకెఆర్‌సి ప్రత్యేక తహాశీల్దార్‌గా నియమించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు తహాశీల్దార్ కార్యాలయంలో డిటిగా పనిచేస్తున్న బి.జనార్ధన్‌ను జరుగుమల్లి తహాశీల్దార్‌గా నియమించారు. మార్కాపురం తహాశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డిటిగా పనిచేస్తున్న డి.భాగ్యలక్ష్మిని కొమరోలు తహాశీల్దార్‌గా నియమించారు. చీమకుర్తి తహాశీల్దార్ కార్యాలయంలో డిటిగా పనిచేస్తున్న బి.సత్య సాయి శ్రీనివాసరావును ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా నియమించారు. యర్రగొండపాలెం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటిగా పనిచేస్తున్న ఏ.జితేంద్ర కుమార్‌ను బేస్తవారపేట తహాశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలం బి.చెర్లోపల్లి గ్రామంలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సిహెచ్ శౌరిబాబు శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈయన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్)లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయన సేవలు మరువలేనివని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వీరారెడ్డి అన్నారు. ఆయన ఉపాధ్యాయుడిగానే కాక రిసోర్స్ పర్సన్‌గా కూడా పనిచేశారని, అందరివాడుగా ఉంటూ ఆదర్శ జీవితాన్ని గడుపుతూ హఠాత్తుగా కన్నుమూయడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రగడ శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం సంతాపాన్ని వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్, పెద్దారవీడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాపయ్య, యల మందరెడ్డి, శ్రీనివాసులు, ఖాసిపీరా, రంగారెడ్డి, ఆర్‌పిపి శ్రీనివాసులు, గోసు సుబ్బారావు, చందలూరు శ్రీనివాసులు, వి.రాజేష్, లావణ్య, సిహెచ్ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు కాశిం సాహెబ్, ఉపాధ్యాయులు హాజరై సంతాపం ప్రకటించారు.

శౌరిబాబుకు నివాళులు అర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

త్వరలోనే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం: ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి త్వరలోనే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం గిద్దలూరు పర్యటనకు వచ్చిన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ముత్తుములతో కలిసి రాచర్ల రోడ్డు రైల్వేగేట్‌ను పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించటానికి ఆర్ఓబీ నిర్మాణ ఆవశ్యకత ఎంతో ఉందని, సంబంధిత రైల్వే అధికారులతో పాటు ఆర్ఓబీ నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్డీయే ప్రభుత్వం గిద్దలూరు పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా ప్రధానమైన రైల్వే గేట్ సమస్యను పరిష్కారం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు ఈరోజు స్థల పరిశీలన చేయటం జరిగిందన్నారు. అతి త్వరలోనే నిర్మాణ ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్ఓబీ నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే గుంటూరు జోనల్ అధికారి, మరియు ఆర్ అండ్‌బి, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ముత్తుముల

సీసీ రోడ్లకు నిధులు విడుదల

ప్రజాశక్తి-తర్లుపాడు

గత వైకాపా ప్రభుత్వం హయాంలో సీసీ రోడ్లు నిర్మించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం నూతన ప్రభుత్వం రాకతో సిసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి చొరవతో తర్లుపాడు మండ లానికి మూడు కోట్ల 27 లక్షల రూపాయల నిధులను మంజూరు అయ్యాయి. మండలంలో తర్లుపాడులోని బీసీ కాలనీకి రూ.36 లక్షలు, మిగిలిన కాలనీలకు రూ.10 లక్షలు, చెన్నారెడ్డి పల్లెకు రూ.10 లక్షలు, మేకలవారిపల్లెకు రూ.40 లక్షలు, కలుజువలపాడుకు రూ.10 లక్షలు, కేత గుడిపికి రూ.8 లక్షలు, బుడ్డపల్లి బీసీ కాలనీకి రూ.40 లక్షలు, మిగిలిన కాలనీలకు రూ.15 లక్షలు, మీర్జపేటకు రూ.40 లక్షలు, ఉమ్మారెడ్డిపల్లెకు రూ.30 లక్షలు, పోతలపాడుకు రూ.15 లక్షలు, సీతా నాగులవరానికి రూ.25 లక్షలు, సూరే పల్లికి రూ.15 లక్షలు, తాడివారిపల్లికి రూ.8 లక్షలు, తుమ్మల చెరువుకు రూ.15 లక్షలు నిధులను సిసి రోడ్లు నిర్మించేందుకు మంజూరు చేశారు. అధికారం చేపట్టిన వెంటనే సీసీ రోడ్ల నిర్మాణానికి, గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న నూతన ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర అభివృద్ధిలో ప్రకాశం పంతులు పాత్ర అజరామరం

(మొదటిపేజీ తరువాయి)

ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి మంత్రితో పాటు ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత చరిత్రపై ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను వారు తిలకించారు. టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు టంగుటూరి సంతోష్ కుమార్‌ను మంత్రి డిబివి స్వామి, ఒంగోలు ఎంపి మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సన్మానించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ టంగుటూరి తన సంపాదనను అంతా దేశసేవ కోసం వెచ్చించిన మహనీయుడన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యంగా సైమన్ కమిషన్, క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి వాటిలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రకాశం పంతులు పోరాట స్ఫూర్తితో జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ పోరాట యోధునిగా, పరిపాలనా దక్షునిగా ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రకాశం పంతులు జిల్లా వాసి కావడం అందరి అదృష్టమన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రకాశం జిల్లా అభివృద్ధికి అందరూ కంకణ బద్దులు కావాలని ఎమ్మెల్యే దామచర్ల కోరారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్ళ తుపాకులకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి ప్రకాశం పంతులు అని, లక్ష్య సాధనలో నేటి యువత టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌పి కె.నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్డీవో జివి సుబ్బారెడ్డి, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం, బాదినేనిపల్లె గ్రామానికి చెందిన కాముని రామిరెడ్డి జ్ఞాపకార్థం గిద్దలూరులోని సంజీవని వృద్ధాశ్రమం, గురుకుల స్వచ్ఛంద సేవ సంస్థ వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లోక్కు శరత్ బాబు, సునీల్ కుమార్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలకు సంజీవని వృద్ధాశ్రమం చైర్మన్ రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

కోల్‌కతా ఘటనలో ముద్దాయిలను అరెస్టు చేయాలి

రేపల్లెలో ర్యాలి నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చెరుకుపల్లిలో ఎస్ఎఫ్ఐ, సిఐటియు నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - రేపల్లె

దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, అన్ని స్థాయిల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సిహెచ్ మణిలాల్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీలు మాట్లాడుతూ మాట్లాడుతూ బెంగాల్ ప్రభుత్వం నిందితులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్న విషయాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నల్లో స్పష్టమైందని తెలిపారు. ఆసుపత్రిలో జరుగుతున్న ఘోరాలు బయటికి రాకూడదనే ఉద్దేశపూర్వకంగా వైద్య విద్యార్థినిని హతమార్చడం కోసం అత్యాచారం చేశారనే అనుమానం వ్యక్తం చేశారు. ఆసుపత్రిపై ముక దాడిని ప్రోత్సహించిన రాజకీయ నాయకులను, దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బిల్‌కిస్ భాను కేసులో అత్యాచార నిందితులను విడుదల చేసి సన్మానించిన ఘనత బిజెపి నాయకులకే చెందుతుందని ఆరోపించారు. దేశానికి వన్నెతెచ్చిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడింది కూడా బిజెపి నాయకులేనని గుర్తు చేశారు. కలకత్తా జూనియర్ డాక్టర్ అత్యాచారంలో అత్యంత దారుణంగా దాడి చేసి హత్య చేయటం సిగ్గుచేటని అన్నారు. దేశంలో ఇలాంటి ఘటనలు జరగకుండా మహిళలు, బాలికలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు అనుబంధ అంగన్‌వాడి వర్కర్స్, ఆశా వర్కర్స్, ఐకెపి విఓఎ యూనియన్ నాయకులు కె ఝాన్సీ, వై మేరీమణి, కె రత్నకుమారి, సిహెచ్ వీరలక్ష్మి, గ్లోరీ, శేషుకుమారి, కృష్ణకుమారి, బెబిరాణి, సిఐటియు నాయకులు కె రమేష్, కెవి లక్ష్మణరావు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : కలకత్తాలో జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యకు నిరసనగా ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. చెరుకుపల్లి, గుళ్లపల్లి ప్రధాన రహదారిలో కళాశాల, నర్సింగ్ విద్యార్థులతో జస్టిస్ ఫర్ మౌమిత, నిందితులను కఠినంగా శిక్షించాలి, సేవ్ గర్ల్స్, సేవ్ ఇండియా, నోసేఫ్టీ నోవర్క్ నినాదాలు చేశారు. చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి మనోజ్ కుమార్, సిఐటియు జిల్లా నాయకుడు కె శరత్ మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, అసలైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు విష్ణు నారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అహ్మద్, గుల్లపల్లి శృతి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హెప్సి రోజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చీరాల : కోల్‌కత్తాలో వైద్యురాలపై అత్యాచార, హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. స్థానిక కోర్టులో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొస్తున్నప్పటికి అమలు కాకపోవడంతో రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రాణాలను పోసే డాక్టర్లకే రక్షణ లేకపోతే సామాన్య మహిళలకు రక్షణ ఏమిటని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరవ రమేష్ బాబు, బండారుపల్లి హేమాంతకుమార్, టిజె సాయిబాబు, రాజు వెంకటేశ్వరరెడ్డి, పిఎన్ఎల్‌వి ప్రసాద్, సజ్జా శ్రీనివాసరావు, నాశన రామకోశ్వరరావు, మిక్కలి పుల్లయ్య, బొనిగల జైసన్ బాబు, గోలి బాలప్రసాదమూర్తి, మంకెన అశోక్ కుమార్, సిరిపురం కామేశ్వరరావు, నీలి కస్తూరి, షేక్ సిరాజ్, షేక్ మస్తాన్‌వలి, అసాది సతీష్‌రెడ్డి. మహిళా న్యాయవాదులు కొండమ్మ, శైలజ పాల్గొన్నారు.

చీరాల కోర్టు వద్ద నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

స్కీమ్‌వర్కర్లకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రభుత్వ పథకాల్లో కార్యకర్తలుగా పనిచేస్తున్న అంగన్‌వాడి, ఆశ, ఐకెపి, విఒఎల సమస్యలపై మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సిఐటియు నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. స్థానిక బస్టాండ్ వద్ద మంత్రితోపాటు ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు వినతి పత్రాలు అందించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వివిధ పథకాల్లో పనిచేస్తున్న మహిళలను మోసం చేసిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 42రోజులు సమ్మె చేసినప్పటికీ జీతాలు పెంపుదల చేస్తామని హామీ ఇచ్చి తప్పుకుందని అన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు ఉద్యోగ విరమణ రాయితీలు, కనీస వేతనాలు అమలు కావడం లేదని అన్నారు. ఐకెపి విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు కోసం కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింజేయాలని కోరారు. సమస్యలపై మంత్రి సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించారు. అన్ని విషయాలు చర్చించి మంచి నిర్ణయాలు చేస్తామన్నారు. స్థానిక సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేసుకోవాలని కోరారు. సిఐటియు నాయకులు కె ఝాన్సీ, వై మేరీమణి, సిహెచ్ వీరలక్ష్మి, శేషు కుమారి, గ్లోరీ, ఎన్ కృష్ణకుమారి, కె రత్నకుమారి, అరుణ, బేబీరాణి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం విగ్రహం ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యప్రసాద్

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - రేపల్లె

మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మాన్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తి దాయకమని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని లక్ష్మీ టాకీస్ సెంటర్, చిన్న మసీదు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ దేశం గర్వించదగిన గొప్ప వ్యక్తి కలాం అన్నారు. అబ్దుల్ కలాం ఆదర్శవంతమైన జీవన విధానం నేటి తరాలకు ఆదర్శం కావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఆర్డిఓ హేలా షారోన్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

శుభకార్యానికి హాజరైన ఏలూరి

ప్రజాశక్తి -యద్దనపూడి

మండలంలోని యనమదల గ్రామానికి చెందిన నిమ్మగడ్డ రమేష్ గృహ ప్రవేశానికి శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు హాజరయ్యారు. రమేష్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు

ఇంద్ర బస్సును ప్రారంభించిన మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

తీర ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోకు నూతనంగా వచ్చిన రెండు ఇంద్ర బస్సులను ఆయన ప్రారంభించారు. ఆర్టిసి డిపోకు నూతన బస్సులను పరిచయం చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే అన్నారు. గతంలో 2016లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే రెండు బస్సులను తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం వచ్చిన 2బస్సులకు తోడు మరో 5బస్సులు త్వరలో డిపోకు రానున్నట్లు చెప్పారు. గత పాలకులు రోడ్లపై దృష్టి సారించకపోవడంతో రవాణా వ్యవస్థ కుదేలైందని ఆరోపించారు. గ్రామాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. వైసిపి నిర్లక్ష్యంగా వ్యవహరించి రోడ్డు రవాణా వ్యవస్థలను నాశనం చేశారని ఆరోపించారు. ఆర్అండ్‌బి రహదారులతో పాటు, గ్రామీణ రహదారులను ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. పంచాయతీల అభివృద్ధికి రూ.1450 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. దారితప్పిన పంచాయితీ వ్యవస్థను గాడిలో పెడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఆర్డిఓ హేలా షారోన్, ఆర్టీసీ డిఎం రాజశేఖర్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇంద్ర బస్సును ప్రారంభిస్తున్న మంత్రి సత్యప్రసాద్

నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి సత్యప్రసాద్

వైద్యశాల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నగరం

ప్రజలు సుభిక్షంగా, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని ధూళిపూడిలో నూతనంగా నిర్మించనున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులకు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. తీర ప్రాంత ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో గతంలో టీడీపీ హయంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. ఆతర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మాణ పనులు మొదలు పెట్టకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం తాము అధికారంలోరి రావడంతో తిరిగి నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులతో పాటు 11మంది సిబ్బంది ఉన్నారని, సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఏర్పాటైన తర్వాత 30 పడకలతో 8 మంది వైద్యులతో పాటు 31మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ దూళిపూడిలో పిహెచ్‌సిని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి సత్య ప్రసాద్ చొరవతో సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్ గ్రేడ్ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ గ్రామంలో 778 ఇళ్లు ఉన్నాయని, 2500 జనాభా ఉంటున్నారని తెలిపారు. చిన్న గ్రామమైన దూలపూడిలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణంకు రూ.6కోట్ల నిధులు మంజూరు చేయడం శుభ పరిణామం అన్నారు. సకాలంలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుబ్బారావు, ఆర్డిఒ హేలా షారోన్, డిసిహెచ్ డాక్టర్ శేషు కుమార్, డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, జడ్పిటిసి నాగమణి, ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, సర్పంచ్ హేమామృతం పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన దివ్యంగా సంఘ నాయకులు తన్నీరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాసన సభ్యులు ఏలూరి సాంబశివ రావును క్యాంపు కార్యాలయంలో కలిస వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని ఆరోపించారు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వలపర్లలో దివ్యాం గులు సమావేశాలు నిర్వహించు కోవడానికి ఎటువంటి వసతి లేదని తెలిపారు. 2019కి ముందు టిడిపి ప్రభుత్వంలో ఎంఎల్ఎ ఏలూరికి వినతి పత్రవం ఇవ్వగా ఆయన స్పందించి 5 సెంట్లు స్థలం కేటాయించి రూ.5 లక్షలు మంజూరు చేయిస్తే ఆ తర్వాత అధికారం లోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ నిధులు విడుదల చేయకుండా దివ్యాంగులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆయన దృష్టికి తెచ్చారు. దివ్యాంగులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అంత్యోదయ కార్డులు మంజూరు చేయించాలని కోరారు. చేతి వృత్తులు చేసుకునే వారికి ఉచిత శిక్షణ కేంద్రాల శిక్షణ ఇప్పించాలని కోరారు. దివ్యాంగ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి అవసరమైన రుణాలు మంజూరు చేయాలని కోరారు. 3చక్రాల మోటార్ వాహనాలు, వీల్ చైర్స్, చేతి కర్రలు, వినికిడి యంత్రాలు మంజూరు చేయించాలని కోరారు. దామెర్ల ఆంజనేయులు, శ్రీనివాసరావు, గౌస్, తవ్వ హనుమంతరావు, టి సైదులు బాబు, షేక్ దిలీప్, చట్టి వెంకటేశ్వర్లు, కోటి లింగమ్మ, తన్నీరు గోపి పాల్గొన్నారు.

వినతి పత్రం తీసుకుంటున్న ఏలూరి సాంబశివరావు

పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేసుకునేలా చూడాలని తహశీల్దార్ ఎం హరిబాబు, మండల వ్యవసాయాధికారి కెవి శేషారెడ్డి అన్నారు. శుక్రవారం యర్రగొండపాలెం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో వారు విఆర్వోలు, వ్యవసాయ సహాయకులతో సంయుక్తంగా ఈ క్రాప్ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశిల్దార్ ఉప్పలపాటి విజయ భాస్కర్, విఆర్వోలు, విఏఏలు పాల్గొన్నారు.

కస్తూరిబాలో అంతరిక్ష దినోత్సవం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం జూనియర్ కళాశాలలో శుక్రవారం అంతరిక్ష దినోత్సవాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ తిరుమలాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల చేత అంతరిక్ష రాకెట్ను తయారు చేయించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంకేతిక ప్రదర్శనలు, విశ్వ అంతరిక్ష విజయాలు, క్విజ్ పోటీలు, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. అనంతరం సిబిఎస్ఈ ట్యాబ్ ఆధారిత సైన్స్ పరీక్షను నిర్వహించారు. ఎంఈవో పి ఆంజనేయులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు స్ఫూర్తితో ముందుకు..

కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్లలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, నివాళులర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బ్రిటీష్ తూటాలకు ఎదురొడ్డి నిలిచిన ధైర్యశాలి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తితో మనందరం ముందుకు సాగాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రకాశం పంతులు చిత్రపటానికి కలెక్టర్ జె వెంకట మురళి, సంయుక్త కలెక్టర్ సుబ్బారావు పుష్పమాలల తో ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్రం కోసం ఎన్నో ఉద్యమాలు నడిపిన స్వాతంత్ర సమరయోధుడుగా టంగుటూరి ప్రకాశం పంతులు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయారని జిల్లా కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి హెచ్ సత్తిబాబు, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ విజయమ్మ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో..

ఒంగోలు కలెక్టరేట్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకాశం పంతులుకు ఎస్పి నివాళి

బాపట్ల జిల్లా: టంగుటూరి ప్రకాశం పంతులు మహనీయుడని ఎస్పీ తుషార్ డూడీ పేర్కొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి.. ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం, దేశభక్తి తో కూడిన పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన, గొప్ప దేశభక్తి కలిగిన వ్యక్తి జీవిత చరిత్రను నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఏఆర్ శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పి చంద్రమోహన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి వేడుకలను పెద్దదోర్నాలలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథపాలకుడు డి.వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: అందరికీ ఆదర్శం ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు అని ఎంఈవో పి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని గురిజేపల్లి గ్రామంలో ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాకబ్, ఉపాధ్యాయులు శాసనాల లలిత, గురవమ్మ, సునీత, బాందీబాషా, సిఆర్పి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- యర్రగొండపాలెం పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కోల్కతాలో ఆర్జి కర్ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు సంబంధించి ఒంగోలులో బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులను బహిష్కరించి.. నిరసన తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు నాగిశెట్టి మోహన్దాస్, ఏలూరి సురేంద్రబాబు పాల్గొన్నారు.

బాపట్లలో..

బాపట్ల జిల్లా: కోల్కతాలో ఆర్జి కర్ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు సంబంధించి బాపట్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు తమ నిరసనను తెలియజేస్తూ మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను ఖండిస్తూ శుక్రవారం బాపట్ల జిల్లా కోర్టులలో విధులను బహిష్కరించారు. కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్యప్రసాద్ మాట్లాడుతూ కోల్కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని ఖండించారు. ఈ ఘటన యావత్ భారత జాతికే తలవంపులు తెచ్చే హేయమైన చర్య అని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు బాషా, వెంకటేశ్వర్లు, శ్రీరామ మూర్తి, ప్రేమ్ చంద్, సాంబశివరావు, రవి బాబు, బండి రామ్మూర్తి, ప్రవీణ్, నాగమోహిని, మురళి, స్టాలిన్, కిషోర్, శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-దర్శి

పనులు ప్రారంభిస్తున్న లక్ష్మి

తాళ్లూరు మండలం విఠలాపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తాళ్లూరు మండల ఎంపిపి తానికొండ శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబుల్రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న మారెళ్ల కుటుంబసభ్యులు

మారెళ్ల వెంకటేశ్వర్లుకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మారెళ్ళ వెంకటేశ్వర్లు 21వ వర్ధంతి సందర్భంగా ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా మారెళ్ల వివేకానంద మాట్లాడుతూ తమ తండ్రి మారెళ్ళ వెంకటేశ్వర్లుని స్మరించుకుంటూ గత 20 సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. దోస్త్ ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ మహబూబ్ మాట్లాడుతూ మారెళ్ల వెంకటేశ్వర్లు గొప్ప మానవతావాది అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాతాశిశు వైద్యశాల, జిజిహెచ్కు వచ్చే రోగుల సహాయకులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో మారెళ్ళ వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు వివేకానంద - సుబ్బమ్మ, సుబ్బారావు- రాజేశ్వరితో పాటు మస్తాన్ గాంధీ, నతల శ్రీనివాసరావు, దివ్య, హరీష్, శివం ఫౌండేషన్ ఛైర్మన్ గొల్లపూడి శ్రీహరి పాల్గొన్నారు.

గ్రామసభలతోనే పల్లె ప్రగతి

టిడిపి దర్శి ఇన్ఛార్జి గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

పల్లెల ప్రగతి గ్రామసభలతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ దర్శి ఇన్ఛార్జి గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. తాళ్లూరు మండలం, గంగవరం గ్రామ సభ కార్యక్రమంలో, దర్శి మండలం, కొత్తపల్లి గ్రామ సభ కార్యక్రమాలలో గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మన పంచాయతీ మన సాధికారిక అనే పేరుతో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామాలలో తాగునీరు, రోడ్లు గ్రామాల ప్రధాన రహదారులు, లింకు రోడ్లు, డొంక రోడ్లు అభివృద్ధి చేసుకునే దిశగా చర్చ జరగాలన్నారు. డ్రైన్లు, మరుగుదొడ్ల నిర్మాణం, గ్యాస్ కనెక్షన్లు, విద్యుత్సరఫరాపై స్థానిక సంస్థల ద్వారా గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ఈ సభలు జరగాలన్నారు. ప్రజాస్వామ్యయుతంగా, రాజకీయాలకు అవకాశం లేకుండా ప్రజలకు అవసరాలు తీర్చే విధంగా ఈ సభలు ఉండాలని అభిప్రాయపడ్డారు. వివాదాలకు, రాజకీయాలకు ఈ సభలు వేదిక కాకూడదన్నారు. ప్రతి గ్రామంలో సిటిజన్ నాలెడ్జ్ బోర్డులను ఏర్పాటు చేసి ప్రతి పౌరుడికి స్థానిక సంస్థల్లో వస్తున్న నిధులు ఎలా ఖర్చు చేస్తున్నారు, ఎందుకు ఖర్చు చేశారు.. అనే అంశాలు పొందుపరుస్తూ గ్రామ స్వరూపం అందులో ఉండాలని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి జరగకుండా బిల్లులు పెట్టకుని రాష్ట్రాన్ని దోచేశారని, అవన్నీ ఎంక్వయిరీ చేయిస్తామని చెప్పారు. కార్యక్రమాలలో కొత్తపల్లి, తూర్పు గంగవరం సర్పంచులు రాము, నాగమణి, ఎంపిడిఓ కీర్తి, ఎపిఒ, ఇఒ, పిఆర్ఆర్డి ఎంపిపి తనికొండ శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి తదితర అధికారులు మరియు గ్రామ సర్పంచ్ నాగమణి, మండల పార్టీ అధ్యక్షులు ఓబుల్రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు రామలక్ష్మయ్య, దర్శి ఎంపిడిఓ కుసుమకుమారి, సిడిపిఓ భారతి, గ్రామ సర్పంచ్ బట్టు రాముయాదవ్, టిడిపి సీనియర్ నాయకుడు గొర్రె సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు అంబటి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

దర్శిలో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

బాపట్ల జిల్లా: గ్రామ పంచాయతీల స్వయం సమృద్ధి కోసం స్వర్ణ పంచాయతీలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు అన్నారు. బాపట్ల మండలం కంకటపాలెం గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సభలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సమస్యల పరిష్కారంతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్నీ అందరికీ చేరువ చేయాలన్నారు. చెక్పవర్ వున్న ఏకైక నాయకుడు సర్పంచ్ అని, గత వైసిపి ప్రభుత్వం సర్పంచ్లను కేవలం ఉత్సవ విగ్రహాలుగా చూసిందన్నారు. సంపద సృష్టించి అభివృద్ధి చేయటం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే సాధ్యం అని అన్నారు. గ్రామసభలో వివిధ శాఖల అధికారులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: గ్రామాల అభివృద్ధి కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి జగన్నాధరావు తెలిపారు. శుక్రవారం పెద్దదోర్నాలలోని గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభను నిర్వహించారు. అనంతరం పలువురు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడివో నాసర్రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సాలమ్మ, సర్పంచ్ చిత్తూరి హారిక, టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, జంగిలి పిచ్చయ్య, సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో గ్రామాలు అభివృద్ధి చెందేలా సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో కార్యాలయ పర్యవేక్షణ అధికారి మరియదాసు అన్నారు. శనివారం పుల్లలచెరువు మండల కేంద్రంలోని సచివాలయంలో ఉపాధి హామీ పనుల ప్రణాళిక, నూతనంగా చేపట్టబోయే పనుల ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేష్, టీడీపీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్ పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేస్తున్నామని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి గూడూరి ఎరిక్షన్బాబు అన్నారు. శుక్రవారం యర్రగొండపాలెం పట్టణంలోని గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ జరిగింది. కార్యక్రమంలో ఎంపిడివో వైవి నాగేశ్వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు షేక్ మస్తాన్వలి, కామేపల్లి వెంకటేశ్వర్లు, వేగినాటి శ్రీనివాస్, మెడబలిమి అచ్యుతరావు పాల్గొన్నారు.

బాపట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



యర్రగొండపాలెంలో మాట్లాడుతున్న ఎరిక్షన్బాబు

టైరు బండ్ల వారిని హెచ్చరిస్తున్న తహశీల్దారు గోపి కృష్ణ

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చీరాల

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దారు కె గోపికృష్ణ అన్నారు. అధికారులు ఎంత కట్టుదిట్టం చేస్తున్న ఇసుక అక్రమ వ్యాపారులు కొత్త పద్ధతులను ఎంచుకున్నారు. టైరు బండిపై ఇసుక తీసుకెళ్ల వచ్చున్న కూటమి ప్రభుత్వం ప్రకటనతో ట్రాక్టర్లు పక్కన పెట్టి ఎద్దుల బండ్లు కొనుక్కొని అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అన్నారు. దీంతో అక్రమ ఇసుక క్వారీలపై రెవిన్యూ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. పాతచీరాల నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్న 17టైరు బండ్లు, ఒక ట్రాక్టరును స్వాధీనం చేసుకుని తహశీల్దారు కార్యాలయానికి తరలించారు. ఇసుకను టైరుబండ్ల ద్వారా ఒక చోటకు తరలించి, నిల్వ చేసి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక కేంద్రాల నుండి మాత్రమే ఇసుక తెచ్చుకోవాలని అన్నారు. ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇసుకను తహశీల్దారు ప్రాంగణంలో అన్‌లోడ్ చేయించారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

బదిరుల పాఠశాలకు బియ్యం బహుకరిస్తున్న మేడూరి

బియ్యం బస్తా బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షులు మేడూరి జానకిరామ్ కుమారుడు చిరంజీవి చరణ్ పుట్టినరోజు సందర్భంగా అద్దంకి, సింగరకొండ రోడ్డులోని చైతన్య బదిరుల ఆశ్రమ పాఠశాల నందు విద్యార్థులకు భోజనానికి అవసరమైన బియ్యం బ్యాగ్, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. చరణ్ జన్మదిన కేక్ కట్ చేసి విద్యార్థినీ విద్యార్థులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పెద్దినేని సురేంద్రబాబు, అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు జమ్ములమడక హనుమంతరావు, మేడూరి పావని, మేడూరి లాస్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

హెచ్ఐవి అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

హెచ్ఐవి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణకు వ్యాధిపై ప్రజలకున్న అపోహలు, అనుమానాలను తొలగించుటకు గ్రామాల్లో అవగాహన కల్పించాలని మండలంలోని తిమ్మాయిపాలెం పంచాయితీ కార్యదర్శి మోహన్ అన్నారు. నిడమానూరు గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఏపి ఎయిడ్స్ నియంత్రణ మండలి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐఓ టిచ్ వర్కర్ కరుణా, శ్రావణి ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలు, అనుమానాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ హనుమయ్య మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపించకూడదని అన్నారు. వారి పట్ల ప్రేమ కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పి శ్రీనివాసరావు, హెల్ప్ టిఐపిఈలు మల్లేశ్వరి, శివపార్వతి, పార్వతి పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

భట్టిప్రోలులో అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ ఆనందబాబు

గ్రామ సభలో మాట్లాడుతున్న చీరాల ఎంఎల్ఎ కొండయ్య

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాష్ట్రంలో కుప్పకూలిన పంచాయతీరాజ్ వ్యవస్థకు జవసత్వాలు నింపేందుకు ప్రభుత్వం గ్రామ సభలకు శ్రీకారం చుట్టిందని, పల్లె పల్లెకు ప్రగతి శోభే ప్రభుత్వ ధ్యేయమని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా శుక్రవారం మార్టూరు, ఇసుక దర్శి గ్రామాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి వెలుగులు పంచాలనే లక్ష్యంతో పటిష్ట ప్రణాళికలతో అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె సీమలను ప్రగతి బాట పట్టించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని అన్నారు. పంచాయతీల పునరుజ్జీవానికి నలుదిశలా విప్లవానికి నాంది పలికామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4,500 కోట్ల నిధులతో 87రకాల పనులకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. రూ.9కోట్ల పని దినాలు, 54 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని 13 పంచాయతీల్లో ఉపాధి పనుల గుర్తింపుకు మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహించిన గ్రామసభల్లో రోడ్ల మరమ్మత్తులు, సైడు కాలవలు, విద్యుత్, రక్షిత నీటి చెరువుల్లో ఫిల్టర్ బెడ్ల సమస్యలపై ప్రజలు ఎక్కువ అర్జీలు ఇచ్చారు. ప్రజల అర్జీలు స్వీకరించిన సంబంధిత ప్రత్యేక అధికారులు, ఆయా పంచాయతీల కార్యదర్శులు ఒక క్రమపద్ధతిలో నిధులు విడుదలైనాక ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సభలో ఈఓఆర్డి కె శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధి పనుల నిధులతో గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేసుకోవచ్చని తెలిపారు. కొంత మంది రైతులు కాటం కుంట విషయంలో గతంలో వర్షాలు పడినప్పుడు సాగర్ కాల్వ వచ్చినప్పుడు గ్రామానికి, రైతులకు నీరు వాడుకునే వారని, గత రాత్రి అందుకు విరుద్ధంగా గ్రామంలో చాటింపు వేయించారని తెలిపారు. అది సమంజసం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, ఈఓఆర్డి శ్రీనివాసరావు, కార్యదర్శి నాగయ్య, సర్పంచి లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

పంగులూరు : ఉపాధి పనుల ద్వారా రాబోయే రోజుల్లో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ప్రజలంతా అందుకు సహకరించాలని ఎంపిడిఒ రామాంజనేయులు కోరారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం గ్రామ సభలు మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించారు. పంగులూరులో జరిగిన సభలో రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను అర్జీల ద్వారా తెలపాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలుపనేని రామారావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ కోటపాడు మైనర్, పంగులూరు మైనర్ కాలువల్లో తుమ్మ చెట్లు విపరీతంగా పెరిగిపోయి నీటిపారుదలకు ఆటంకంగా ఉన్నాయని తెలిపారు. ఉపాధి నిధుల ద్వారా తుమ్మచెట్లను తొలగించేందుకు తీర్మానించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ లామ్ సునీత, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ, జడ్పిటిసి రాయిని ప్రమీల, పశు వైద్యులు మురళీకృష్ణ, తెలుగుదేశం నాయకులు రావూరి రమేష్ బాబు పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని 14 పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించినట్లు ఇన్చార్జి ఎంపిడిఒ లక్ష్మీనారాయణ తెలిపారు. అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులపై రాబోయే ఏడాదికి ఎన్ని పనులు నిర్వహించాలో సభల్లో నిర్ణయించినట్లు తెలిపారు. స్వర్ణ పంచాయతీలో జరిగిన సభలో గత ఐదేళ్లుగా నిధులు దుర్వినియోగం జరిగాయని ఆరోపించారు. విచారణ జరిపించాలని గ్రామానికి చెందిన నాయకులు చిన్న నారాయణ, ప్రభుజి వినతి పత్రం ఇచ్చారు. తాగునీటి పథకంను వ్యాపారంగా నిర్వహించారని, దీనిపై ఆర్వో ప్లాంటుకు రూ.35లక్షల కరెంట్ బిల్లు నిర్వాహకులు వాడుకుంటే ఆ బిల్లును పంచాయతీ చెల్లించిన విధంగా చూపించారని ఆరోపించారు. ఉపాధి హామీ పనులు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు చెల్లించినట్లు రికార్డులు సృష్టించారని గ్రామస్థులు ఆరోపించారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉన్నారని, ఈ నెల ఆఖరులో మరల గ్రామసభ నిర్వహించి ఆరోపణలపై విచారిస్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

మార్టూరు రూరల్ : మండలంలోని వివిధ గ్రామాల్లో త్రాగు నీటి సమస్యలు, డ్రైనేజీలు లేక నీరు పోయే వసతి లేక విజృంభిస్తున్న దోమలతో పలువురు అనారోగ్యాలకు గురవుతున్నారని ఫిర్యాదు చేశారు. చిన్నారులపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్న విషయాన్నీ అధికారులకు తెలిపారు. రాజుపాలెం గ్రామంలో వందనం బడి ఎదురు కాలనిలో రెండేళ్ల చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి తలను తీవ్రంగా గాయపర్చడంతో ప్రస్తుతం గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాల్లో చికిత్స పొందుతున్న విషమ పరిస్థితిలో ఉందని తెలిపారు. ప్రత్యేక అధికారి, ఎంఈఓ2 కె హైమావతికి స్థానికులు విన్నవించారు. అంగన్‌వాడి కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

వేమూరు : గడచిన ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని శసన సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సభల్లో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి జరగకుండా బిల్లులు పెట్టుకుని దోచేశారని ఆరోపించారు. వైసిపి పాలనలో రాష్ట్రం ఐదేళ్లు అభివృద్ధి అట్టడుగుకు వెళ్ళిందని అన్నారు. రూ.లక్షల కోట్లు అప్పులు చేసి నాశనం చేశారని అగ్రహ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు సుశీల, ఎంపిడిఒ శేషగిరిరావు, ఈఒపిఆర్ డి శేఖర్ బాబు, జనసేన ఇన్‌ఛార్జి ఊసా రాజేష్, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఉపాధి హామీ పథకం క్రింద 2024-2025 ఆర్థిక సంవత్సరంనకు మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు శుక్రవారం నిర్వహించినట్లు ప్రత్యేక అధికారి యమహా హనుమంతరావు తెలిపారు. మండలంలోని ఐలవరం సచివాలయం వద్ద జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం క్రింద పనిచేస్తున్న వేతన దారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. నూతన పనులు గుర్తించి గ్రామ సభ ఆమోదం పొందారు. కార్యక్రమంలో తహశీల్దారు మేక శ్రీనివాసరావు, ఎంపిడిఒ గుమ్మా చంద్రశేఖర్, పిఓపిఆర్డి ఊహారాణి, ఐలవరం సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, భట్టిప్రోలు సర్పంచ్ ద్వారా రవికిరణ్మయి, వెల్లటూరు సర్పంచ్ బొజ్జ రవి, కార్యదర్శులు గోలి శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, రామ్ కుమార్, ఎంపిటిసి మురుగుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని అనంతవరంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. సభకు హాజరైన స్పెషల్ ఆఫీసర్ పిచ్చిరెడ్డికి వ్యవసాయం కార్మిక సంఘం జిల్లా నాయకులు బొనిగల సుబ్బారావు గ్రామంలోని సమస్యలను వివరించారు. ఉపాధి హామీ పనులు కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, మంచినీటి సౌకర్యాలు, పలుగు, పార ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ ఐ సత్యనారాయణ, సెక్రెటరీ మనిరాజు పాల్గొన్నారు.

చీరాల : గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో పరిష్కారం సులువుతుందని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు, పంచాయితీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావూరు వారిపాలెం, పిట్టువారిపాలెం, కొత్తపేట గ్రామ సభల్లో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ప్రయోజనాలు వివరించారు. చీరాల, వేటపాలెం తహశీల్దార్లు కె గోపికృష్ణ, పార్వతి, ఎంపిడిఒలు నేతాజీ, శర్మ, కొత్తపేట పంచాయతీ ప్రత్యేక అధికారి శేషయ్య, కార్యదర్శి బి రమేష్ బాబు, కౌతవరపు జనార్ధన్, మధు పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని తోకలవానిపాలెం పంచాయతీలో జరిగిన గ్రామ సభలో సర్పంచ్ టి కృష్ణమోహన్ మాట్లాడారు. పంచాయతీలో చేయవలసిన ఉపాధి పనులను గుర్తించినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అనే అంశాలు సభలో తీర్మానం చేశారు. ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూముల్లో మెరక పల్లాలు సదును చేసేందుకు ఉపాధి పనుల ద్వారా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిప్రభు, ఉపాధి హామీ టిఎ కిషన్, గోపాల్, నవీన్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పనిలేని కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి జరుగుతుందని తహశీల్దారు పద్మావతి అన్నారు. గ్రామ సభకు సర్పంచ్ దేవరకొండ వాణి అధ్యక్షత వహించారు. మండలంలోని 16 పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు.

సంతమాగులూరు : గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మక్కెన వారిపాలెం సచివాలయం ఆవరణంలో జాయింట్ కలెక్టర్ బి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని అన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పంచాయితీరాజ్ వ్యవస్థకు కొత్త ఊపిరి ఊదుతున్నారని అన్నారు. గత ఐదేళ్లలో పంచాయతీలకు చెందాల్సిన రు.13వేల కోట్ల నిధులను జగన్ మళ్ళించుకొని ద్రోహం చేశాడని అన్నారు. చంద్రబాబు 2నెలల్లో గ్రామీణాభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.990 కోట్లు, జల జీవన్ మిషన్ పథకం నుండి రాష్ట్ర వాటా రూ.500 కోట్లు కలిపి రూ.1490కోట్లను పంచాయతీలకు జమ చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచి దారా సుజాత, తహశీల్దారు కె రవిబాబు, మాజీ జెడ్పిటిసి తేళ్ల శ్రీనివాసరావు, మక్కెన జగదీష్, తేలప్రోలు రమేష్, చేవూరి వాసురెడ్డి, అట్లా చిన్న వెంకటరెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి, చింతా రామారావు, గొట్టిపాటి చౌదరి బాబు, డి గాలెయ్య పాల్గొన్నారు.

పంగులూరు గ్రామ సభలో ఎంపిడిఒ రామాంజనేయులు

చెరుకుపల్లి గ్రామ సభలో తహసిల్దార్ పద్మావతి

తోకలవానిపాలెం గ్రామసభలో సర్పంచి కృష్ణమోహన్

ప్రజాశక్తి
7
శనివారం 24 ఆగస్టు 2024

ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుకు ఘన నివాళి

ప్రకాశం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులని ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య అన్నారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా పేరాల కూరగాయల మార్కెట్ సెంటర్లోని ఆయన విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గ్రంథాలయంలో ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రంథపాలకురాలు డి ధనమ్మ పాల్గొన్నారు.

అద్దంకి : మండలంలోని తిమ్మాయపాలెం జెడ్పి ఉన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం పి గంగాధర్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అన్నారు. ఒంగోలు జిల్లాకు 1972లో ప్రకాశం పేరు పెట్టారని చెప్పారు. ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలని సూచించారు. ఆయన జీవిత చరిత్రపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో మొదటి బహుమతి ఎ తన్మయి, 2వ బహుమతి డి శాలిని, 3వ బహుమతి ఎం పార్థుకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్ పాల్గొన్నారు. గ్రంథ పాలకుడు చుండూరి సుగుణరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సందిరెడ్డి శ్రీనివాసరావు, విశ్రాంత ఆర్జెడి దేవపాలన, దివాకరదత్తు, రఫీ, కెనరా బ్యాంక్ మేనేజర్ ఐఎస్టి సాయి, చప్పిడి వీరయ్య, సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వీర్రాజు పాల్గొన్నారు.

ఇంకొల్లు : స్థానిక పంచాయితీ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈఓఆర్డీ, సర్పంచి లక్ష్మీ ప్రసన్న, కార్యదర్శి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పంగులూరు : స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు మండలంలో శుక్రవారం నిర్వహించారు. పాఠశాలల్లో జయంతి వేడుకలు జరిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంఇఒ జి వీరాంజనేయులు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర సమరంలో చూపిన సాహసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, పంచాయతీ సెక్రెటరీ వందనం పాల్గొన్నారు.

అద్దంకి : ప్రకాశం పంతులు 153వ జయంతి ప్రకాశం మిత్రమండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. డాక్టర్ యు దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, గాడేపల్లి దివాకర దత్, ఇలపావులూరి శేషతల్పశాయి, వీరవల్లి సుబ్బారావు, కెవి మారుతీరావు, డివిఎం సత్యనారాయణ, అన్నమనేని వెంకట్రావు, కె అనిలకుమారసూరి, వూటుకూరి కృష్ణసుభాన్, షేక్ మస్తాన్, వూటుకూరి రామకోటేశ్వరరావు, చప్పిడి వీరయ్య, సుగుణరావు, చిన్ని మురళీకృష్ణ మాట్లాడారు. వూటుకూరి నరేంద్ర, సంకా సుబ్రహ్మణ్యం, రాచమల్లు శివాంజనేయులు విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచ, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. షేక్ మహమ్మద్ రఫీ, పాలపర్తి జ్యోతిష్మతి, భువనేశ్వరి సహకారంతో బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మిత్రమండలి

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సత్యప్రసాద్

నారాయణలో నమూనా ఎన్నికలు

ప్రజాశక్తి - రేపల్లె

విద్యార్థుల్లో ప్రజాస్వామ్య ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకు నమూనా ఎన్నికలు నిర్వహించినట్లు నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ అంబటి సత్యప్రసాద్ చెప్పారు. పాఠశాలలో నమూనా ఎన్నికలు, క్యాబినెట్ విధివిధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య భావన పెంపొందించాలని అన్నారు. ప్రజాస్వామ్యం పట్ల గౌరవాన్ని కలిగి ఉండే విధంగా నమూన ఎన్నికలు దోహదపడతాయని చెప్పారు. ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులను స్కూల్ పీస్ కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అవలంబించు కోవాలని చెప్పారు. ఎజిఎం వెంకటేశ్వ రరావు, కోఆర్డినేటర్ బేబీ రాణి పాల్గొన్నారు.

పావులూరులో పంట పొలం పరిశీలిస్తున్న ఎడిఎ

బీజామృతంతో విత్తనశుద్ధి

ప్రజాశక్తి - ఇంకొల్లు

మినుము పంట సాగు చేసిన రైతులను ఉద్దేశించి పర్చూరు ఎడిఎ ఎన్ మోహన్‌రావు మాట్లాడారు. తప్పనిసరిగా బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలని అన్నారు. మండలంలోని పావులూరులో శుక్రవారం పొలంబడి ఎఒ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ మినుము పంట విత్తిన వెంటనే కలుపు నివారణకు పెండి మితిలిన్ 30శాతం, హిమాజిత్ ఫెయిర్ 2శాతంను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. మినుము పైవచ్చు బూడిద నివారణకు మైక్లో బుటని 200 గ్రాములు ఒక ఎకరంలో నీటిలో కలిపి చేసుకోవాలని చెప్పారు. లేదా డైపానైట్ మితల్ల్ 200 గ్రాములు ఒక ఎకరాకు లేదా నీటిలో కరిగే గంధకం 600 గ్రాములు ఎకరానికి కలిపి చేసుకోవడం వల్ల తెగుళ్ల తగ్గించవచ్చని చెప్పారు. పూత, పింద రాలకుండా ఉండటానికి నోవాల్యూరాన్ ద్రావణాన్ని 200 మిల్లీమీటర్లు ఒక ఎకరానికి నీటిలో కలుపుకొని వాడాలని సూచించారు. పత్తి పైరును పరిశీలించి రసం పీల్చే పురుగుల నివారణకు కాండంకు మోనోక్రోటపాస్ ముందు లేదా కాన్ఫడర్లను పైరు ఇరవై రోజులు వ్యవధికి ఒకసారి 40 రోజులుకు ఒకసారి లేత కాండానికి మందు పూసే విధానాన్ని చూపించారు. కార్యక్రమంలో పావులూరు, ఇంకొల్లు విఎఎలు వినయ్ కుమార్, భరత్, అభ్యుదయ రైతులు వెంకటరావు, నాగరాజు, రమేష్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -కారంచేడు

మండలంలోని కుంకులమర్రు, కారంచేడు, స్వర్ణ గ్రామాల్లో విద్యుత్తు సరఫరా శనివారం నిలిపివేనున్నట్లు ఎఈ రాంబాబు తెలిపారు. విద్యుత్ తీగలు మరమ్మత్తుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం లభిస్తుంది

ప్రజాశక్తి - భట్టిప్రోలు

చేనేత పరిశ్రమకు పూర్వవైభవం లభిస్తుందని చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని ఐలవరం ఖాదీ భండార్ కార్యాలయం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా చేనేత కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ చేనేత పరిశ్రమ మునగడకు ప్రకాశం పంతులు అప్పట్లో ఎంతో కృషి చేశారని అన్నారు. ప్రస్తుతం పరిశ్రమ అవసాన దశలో ఉన్నప్పటికీ భవిష్యత్తులో చేనేత పరిశ్రమకు పూర్వవైభవం వస్తుందని అన్నారు. మిల్లు వస్త్రాల తయారీకి వినియోగించే రంగులు, రసాయనాలు వలన అధిక ఖర్చుతో పాటు భవిష్యత్తులో అనేక అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని, దీని దృష్ట్యా ఎలాంటి కాలుష్యం లేని చేనేత వస్త్ర తయారీకి మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. ప్రస్తుతం చేనేత రంగంలో పనిచేసే కార్మికులతో పాటు యువకులను ఈ రంగంపై మక్కువ చూపితే నూతన డిజైన్లు, నాణ్యమైన వస్త్ర తయారిపై శిక్షణ ఇస్తామని చెప్పారు. ఉపాధి కోసం ఎక్కడికో వెళ్లే పనిలేకుండా ఇంటి వద్దనే ఉండి నేత పనిచేసుకొని సంపాదించుకునే విధంగా తీర్చిదిద్దుతామని అన్నారు. వస్త్ర తయారీకి మంచి మార్కెట్ ఆదరణ లభిస్తుందని అన్నారు. తద్వారా జీవనోపాధి పెరుగు పడుతుందని వివరించారు. వినోదరాయుని పాలెంలో 1872 ఆగస్టు 23న జన్మించిన ప్రకాశం పంతులు భారతదేశ చరిత్రలో చెరగని ముద్ర వేశారని అన్నారు. ఆయన స్ఫూర్తితో చేనేత రంగాన్ని ముందుకు తీసుకు వళ్లాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. అందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధిని కలిగి ఉన్నాయని చెప్పారు. ఐలవరం, రేపల్లె చుట్టుపక్కల ప్రాంతాల్లో చేనేత వస్త్ర ఉత్పత్తిని ప్రారంభించి గ్రామ ఉద్యోగ సొసైటీలకు అంకురార్పణ జరిగిందని అన్నారు. స్వాతంత్ర పోరాటానికి ఆయుధంగా పనిచేసిన ఖాదీకి పునర్జీవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ జి రేఖారాణి, కెవిఐబి సీఈఒ నాయక్, జాయింట్ డైరెక్టర్ కె కన్నబాబు, ఎడి జె రాజవర్ధన్, బి వనజ, ఎడిఒలు పి వెంకటేశ్వరరావు, పడమట వెంకటరావు, ఉమామహేశ్వరరావు, మేనేజర్ వెంకటేశ్వరరావు, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపిటిసి మురుగుడు శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు జొన్నాదుల రెడ్డియ్య, ఆంధ్ర కేసరి సొసైటీ అధ్యక్షులు యశోదకృష్ణ, మాచర్ల నాగరాజు, దీపాల ప్రసాదు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కె సునీత

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగళ్ళ ప్రదీప్

క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చీరాల

క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా అవగాహన కలిగి ఉండాలని హెచ్‌సిజీఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్ నాగళ్ల ప్రదీప్ కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల్లో ఒంగోలు హెచ్‌సిజీఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ ఉచిత క్యాన్సర్ శిబిరం నిర్వహించారు. ఒంగోలులో తమ హాస్పిటల్‌లో రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో పొగాకు ఉత్పత్తులు వాడకం వలన వచ్చే క్యాన్సర్ ముందే గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ, వైట్ రేషన్ కార్డ్ ఉన్నవారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏక్సిక్యూటీవ్ సీహెచ్ శరత్ బాబు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎడిఎ సయ్యద్ అక్తర్ హుస్సేన్

వరిలో సమగ్ర సస్యరక్షణ పాటించాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

రైతులు వరి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ సయ్యద్ అక్తర్ హుస్సేన్ సూచించారు. మండలంలోని పల్లపట్లలో గుంటూరు ఆత్మ సౌజన్యంతో సర్పంచ్ రత్న ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన శిక్షణలో మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను వివరించారు. ఎఒ కె శారద మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈ - క్రాప్ నమోదు చేయించుకో వాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైని వై శివకుమారి మాట్లాడుతూ రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడాలంటే ప్రకృతి వ్యవసాయం ఒకటే మార్గమని చెప్పారు. రైతులకు ఘన, ధృవ జీవామృతాల తయారీ విధానం తెలిపారు.

కారంచేడు-చీరాల రోడ్డులో ప్రమాదం

ప్రజాశక్తి - కారంచేడు

కారంచేడు, చీరాల ప్రధాన రహదారి చిన్న చెప్టా వద్ద శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారంచేడు నుండి చీరాల వెళుతున్న ద్విచక్ర వాహనం ఆటోను ఓవర్ టేక్ చేసి ముందుకు వెళ్లడంతో చీరాల నుండి కారంచేడు వెళుతున్న కారును ఢీ కొంది. దీంతో బైకు నడుపుతున్న వ్యక్తి ఎగిరి కారు అద్దం మీద పడి తీవ్ర గాయాలు అయ్యాయి. అతను, బైకు నుజ్జు నుజు అయ్యింది. స్థానికులు ప్రమాద సమాచారాన్ని పోలీసులకు అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కారంచేడు ఎస్ఐ వెంకటరావు తీవ్ర గాయాలైన ద్విచక్ర వాహనదారున్ని తన జీపులో చీరాల ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు బాపట్ల మండలం కొణిజేటివారిపాలెంకు చెందిన సుబ్బారావుగా గుర్తించారు. తన పేరు, ఊరి పేరు చెప్పి అపస్మాక స్థితిలోకి వెళ్లడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఏరియా వైద్యశాల అభివృద్ధికి కృషి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన టిడిపి నాయకులతో కలిసి ఏరియా వైద్యశాలను సందర్శించారు. అక్కడి రోగులు, ప్రభుత్వ వైద్యులతో మాట్లాడారు. అనంతరం వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యాదిద్యతో సమావేశమయ్యారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న చికిత్సలు, సదుపాయాలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల ప్రజలకు ఏరియా వైద్యశాల ఎంతగానో ఉపయోగపడనుందని చెప్పారు. అన్ని విభాగాల స్పెషలిస్టు వైద్యులను నియమించేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. రోగులకు అసౌకర్యం కలగకుండా మెరుగైన చికిత్సలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు చీదెళ్ల నాగేశ్వరరావు, ఆదిరెడ్డి, మస్తాన్‌వలి, వలి, జనసేన మండల కన్వీనర్ ఆకుల రమేష్ పాల్గొన్నారు.

పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- భవిష్యత్‌లో అన్ని మండల కేంద్రాల్లో అన్నా క్యాంటీన్లు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

మాట్లాడుతున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-సిఎస్.పురం

పేద ప్రజలకు ఉపాధి కల్పించి వారిని అన్ని విధాలా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. సిఎస్.పురంలో శుక్రవారం సర్పంచ్ శ్రీరాం పద్మావతి అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా పేదలందరికీ పనులు కల్పించి వలసల నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో అన్ని మండల కేంద్రాల్లో పేదల కోసం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సిఎస్.పురంలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ అభివృద్ధికి నాలుగు కోట్ల 65 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తమ దష్టికి వచ్చాయని,ప్రత్యేక అధికారి నియమించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలో నకిలీ ధ్రువపత్రాలు సష్టించి వికలాంగు పింఛన్లు పొందుతున్నారని, విచారణ చేపట్టి తొలగించే విధంగా కృషి చేస్తానన్నారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ సిఎస్.పురం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని, కలెక్టర్‌ను కోరారు. సిఎస్.పురంలో ఉన్న ప్రభుత్వభూమిని కన్వర్షన్ చేసి అర్హులం దరికీ ఇళ్ల పట్టాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో డ్వామా పిడి అర్జున్ రావు, డిపిఓ ఉషారాణి ఆర్‌డిఓ జాన్ ఇర్విన్, ఏపీ డి.రాజారావు, ఎంపి డిఓ రామచంద్రరావు, తహాశీల్దార్ మంజునాథ రెడ్డి, ఏపీఓ వ్యాక్యావతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సిఎస్.పురం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ ప్రజలు మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేకి వినతి పత్రాలు సమర్పించారు. సిఎస్.పురంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు కోరారు. గ్రామంలో ఇళ్ల మీదనే కరెంటు వైర్లు ఉన్నాయని, వాటిని మార్పించాలని పలువురు గ్రామ ప్రజలు వినతి పత్రాలు సమర్పించారు.

ఉచిత ఇసుక విధానంలో

సమస్యలు లేకుండా చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మైన్స్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. ఉచిత ఇసుక విధానంపై అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ఇసుక రేవులు, స్టాక్ పాయింట్ల వద్ద వాహనాల రద్దీ లేకుండా చూడాలని ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఇసుక లభ్యత వినియోగంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయన సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ ప్రజలకు అందుబాటులో ఉన్న విషయాన్ని విస్తత ప్రచారం చేయాలన్నారు. నది పరివాహక ప్రాంతాలలో ఇసుక పూడికతీత పనులపై ఆరా తీశారు. ఇసుక వినియోగంపై ఎప్పటికప్పుడు వివరాలు అందించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, మైన్స్ శాఖ ఏడి రాజేష్ పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- యరజర్లలో రూ.1.30 కోట్లతో మౌలిక వసతులు
- గ్రామ సభలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు హామీ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో గ్రామాల సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కార్యక్రమం నేపథ్యంలో శుక్రవారం గ్రామ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ గత ప్రభుత్వం మొక్కుబడిగా గ్రామ సభలను నిర్వహించిందని, కూటమి ప్రభుత్వం ప్రజలను భాగస్వాములుగా చేసుకుంటూ గ్రామసభలు నిర్వహించి గ్రామాభివద్ధికి కషి చేస్తుందన్నారు. యరజర్ల గ్రామ సమగ్రాభివద్ధికి ఈ ఏడాది తొలివిడతగా రూ.1.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటితో సిమెంట్ రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడతామని, మిగతా నిధులు రాబోయే కాలంలో విడుదల చేస్తామన్నారు. గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన దాదాపు రూ.13 వేల కోట్ల నిధులు గత ప్రభుత్వం వేరే అవసరాలకు మళ్ళించడంతో గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లించే పరిస్థితి లేదన్నారు. దీంతో గ్రామాల్లో అభివద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వై.గోపీచంద్, టిడిపి జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ, టిడిపి జిల్లా నాయకులు జి.రాజ్ విమల్, బిజెపి నాయకులు యానం చిన్న యోగయ్య పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రేషన్ కార్డులు కాదు..

దళిత నేత నీలం నాగేంద్రరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి రిజర్వేషన్లు రేషన్ కార్డులు కాదని ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుంచుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు స్పష్టం చేశారు. ఒంగోలులోని తన కార్యాలయంలో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక సదస్సు ఆహ్వాన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేంద్ర రావు మాట్లాడుతూ ఎస్‌సి రిజర్వేషన్లు, ఎస్‌సి కులాల జాబితాలను గాని సవరించే అధికారం సుప్రీం కోర్టుకు లేదన్నారు. 9వ షెడ్యూల్‌లో పొందుపరచబడిన ఎస్‌సి రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకునే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందన్నారు. ఈ నెల 25 ఆదివారం విజయవాడ జింఖానా గ్రౌండ్స్ సమీపంలో జరిగే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సదస్సుకు ఎస్‌సిల ఐక్యతను కోరుకునే ప్రజలు ప్రజాస్వామికవాదులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.